ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

- ప్రజలకు చేరువలో వైద్యం
- 60, 89 వార్డుల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలకు విశేష స్పందన
- వేలమందికి ఉచిత వైద్య సేవలు



60వ వార్డు వాయుపుత్ర కాలనీ మైదానంలో జగనన్న ఆరోగ్య కిట్ అందిస్తున్న జెడ్సీ కృష్ణ



60వ వార్డులో రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది



89వ వార్డు యల్లపువానిపాలెంలోని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద రద్దీ

మల్కాపురం: ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని జోన్–5 జోనల్ కమిషనర్ కృష్ణ అన్నారు. అందులో భాగంగానే రాష్ట్రం నలుమూలలా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా క్యాంపులు ఏర్పాటు చేసి, లక్షలాది మందికి వైద్యసేవలను చేరువ చేశారన్నారు. 60వ వార్డులోని వాయుపుత్ర కాలనీ వద్ద గల మైదానంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక ఇందిరా కాలనీ, ఇండ్రస్ట్రియల్ కాలనీ, జనతా కాలనీ సచివాలయాల పరిధిలో నిర్వహించిన శిబిరంలో జెడ్సీ పాల్గొని, మాట్లాడారు. ఈ క్యాంప్‌లో జనరల్ వైద్యులతో పాటు వైద్యనిపుణులు హాజరై వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీవీఎంసీ 40, 60, 62 వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమం తమ ప్రాంతంలో జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు ఇంటి చెంతనే పైసా ఖర్చు లేకుండా వైద్య నిపుణుల ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందన్నారు. శిబిరంలో 1200 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. జనరల్ ఫిజీషియన్‌తో పాటు ఆర్థో, డెంటల్, నేత్ర, స్త్రీ వైద్య నిపుణులు రోగులకు పరీక్షలు చేసి, మందులు అందించారు. అవసరమైన వారిని వేరే ఆస్పత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్, ఏపీడీ పద్మావతి, మెడికల్ ఆఫీసర్ సుజిత్ తదితరులతో పాటు, స్థానిక నాయకులు భోగవల్లి నాగభూషణం, మళ్ల ధనలత, అంగ రామ్‌ప్రసాద్, పిల్లా కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యం

గోపాలపట్నం: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తున్నారని జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. 89వ వార్డు పరిధి 458, 461,462 సచివాలయాల పరిధిలో ప్రజలకు యల్లపువానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఇలాంటి కార్యక్రమం చూడలేదని, వినలేదన్నారు. విద్య, ఆరోగ్య భద్రత, ఆహార భద్రత తదితర అంశాలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, డీఎంవో తులసీరావు, ఏపీడీ శ్రీరామ్, వైఎస్సార్‌సీపీ నాయకులు అయితంశెట్టి గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు, గేదెల మురళీకృష్ణ, మళ్ల శ్రీనివాసరావు, గుణిశెట్టి శ్రీనివాసరావు, కంపర కోటేశ్వరరావు, పలువురు వైద్యులు, సచివాలయ కార్యదర్శులు, గృహ సారథులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలకు ప్రత్యేక గదులు

శిబిరంలో వైద్య పరీక్షలకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్యులకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ప్రధాన శిబిరంలో వైద్య పరీక్షలకు వచ్చే వారి వివరాలు నమోదు చేసుకుని టోకెన్ ఇచ్చారు. అనంతరం వారికి వైద్య పరీక్షలు చేసి, వారి సమస్యను బట్టి వైద్య నిపుణుల వద్దకు పంపించారు. శిబిరంలో 10 మంది వైద్యులు పాల్గొన్నారు. గైనిక్, ఆర్థోపెడిక్, కంటి వైద్యనిపుణులు, జనరల్ ఫిజీషియన్, ఈఎన్‌టీ, దంత వైద్యనిపుణులు పాల్గొన్నారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందించారు. అవసరమైన వారిని వేరే ఆస్పత్రులకు రిఫర్ చేశారు. శిబిరంలో బెహరా ఆస్పత్రి వైద్యులు సహకారం అందించారు.

పరిశీలించిన డీఎంహెచ్‌వో

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు శిబిరాన్ని పరిశీలించారు. వైద్యానికి వచ్చేవారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఇక్కడి ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



వైద్య శిబిరంలో పాల్గొన్న జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆకట్టుకున్న స్టాల్స్

వైద్య శిబిరంలో భాగంగా మలేరియా విభాగం అధికారులు, డ్వాక్రా గ్రూప్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. మలేరియా విభాగం అధికారులు దోమల వల్ల కలిగే వ్యాధులను వివరించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. బాలింతలకు, గర్భిణులకు, చిన్న పిల్లలకు ఏ విధంగా పౌష్టికాహారం అందిస్తున్నారో తెలియజేశారు. వారందించే సరకులతో ఏ విధమైన వంటకాలు చేయవచ్చో తెలియజేస్తూ.. వండే విధానాలను వివరించారు.

డాక్టర్లు బాగా చూశారు



నాకు జ్వరం, ఆయాసం ఉండటంతో ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చాను. డాక్టర్లు మంచిగా పరీక్షలు చేశారు. ఆరోగ్యం గురించి చాలా బాగా వివరించారు. మందులు అందించారు. ఇలాంటి శిబిరాలు మాలాంటి వారికి ఎంతో ఉపయోగం.

– ఎం రామారావు, చంద్రనగర్

వైద్యులే మా వద్దకు వచ్చారు



ఆరోగ్యం బాగా లేకపోతే మేమే ఆస్పత్రులకు తిరిగే వాళ్లం. కానీ ప్రభుత్వమే ఇంతమంది వైద్యులతో శిబిరం పెట్టడం ఇప్పుడే చూస్తున్నాను. మా ఇంటి దగ్గరకే వైద్యులు వచ్చారు. అన్ని పరీక్షలు చేశారు. జగనన్న మంచి కార్యక్రమం పెట్టారు.

– కె.లక్ష్మి, భగత్‌సింగ్ నగర్

ఆర్థోపెడిక్ సమస్యతో వచ్చాను



చాలా రోజులుగా ఆరోగ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నాను. ఈ శిబిరంలో ఎముకల డాక్టర్‌ను కలిశాను. మంచి సలహాలు ఇచ్చారు. పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. ఈ వైద్య శిబిరం మాకు భరోసాను ఇచ్చింది.

– పి.రేవతి సంతోష్‌నగర్

ఇక్కడి సేవలు బాగున్నాయి



ఈ వైద్య శిబిరంలో వైద్యసేవలు చాలా బాగున్నాయి. వైద్యులు మర్యాదపూర్వకంగా చూశారు. ప్రేమగా మాట్లాడారు. మా సమస్యలు ఓపికగా విన్నారు. మంచి సలహాలు ఇచ్చారు. మందులు అందించారు.

– అమీనా బేగం, సంతోష్‌నగర్

చాలా మంచి కార్యక్రమం



ముఖ్యమంత్రి చాలా మంచి పనులు చేస్తున్నారు. వలంటీర్లు, వైద్యసిబ్బంది ఇంటింటికీ వచ్చి వైద్య పరీక్షలు చేశారు. ఆ తరువాత ఈ రోజు మాకు దగ్గర్లోనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వైద్య సేవలు అందించారు. ఆరోగ్యశ్రీ ఉన్న ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. ఎంతో మంది ఆరోగ్యాలు బాగుపరిచే మంచి కార్యక్రమం.

– పి.తవిటయ్య, కొత్తపాలెం

క్లుప్తంగా

చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ



చిన్నారులకు సూచనలు ఇస్తున్న చిత్రకారుడు భాస్కరరావు

మల్కాపురం: చిన్నారులకు ప్రముఖ చిత్రకారుడు, సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావు ఉచితంగా శిక్షణను ఇస్తున్నారు. స్థానిక ఫంక్షన్ హాల్లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ వద్ద పని చేస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది పిల్లలు సుమారు వంద మంది పాల్గొని, చిత్రలేఖనంలో మెలకువలు నేర్చుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న చిత్రకారుడు చెల్లూరి మాట్లాడుతూ తనకు తెలిసిన విద్య పదిమందికీ పంచాలనే ఆలోచనతో చిన్నారులకు ఉచితంగా చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్నానన్నారు. చిన్నారులు చిత్రలేఖనంలో ప్రతిభావంతులు అయ్యేవరకు ఈ శిక్షణ కొనసాగుతుందని చెప్పారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



నిరాశ్రయులకు దుప్పట్లు అందజేస్తున్న రమణ

విశాఖ విద్య: నిరాశ్రయులకు ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. ఎన్ఏడీ సెంటర్ సమీపంలోని బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో మంగళవారం ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. విసా కార్యదర్శి రామ్మోహన్‌రావు, షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత తో కలసి షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. పండ్లు, స్వీట్లు అందజేశారు. కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ జీవీఎంసీ ఆధ్వర్యంలో నిరాశ్రయుల షెల్టర్లను నిర్వహించడం హర్షణీయమన్నారు.

జోన్ 8లో సురక్ష శిబిరాల షెడ్యూల్

గోపాలపట్నం : జోన్ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఏపీడీ శ్రీరామ్ తెలిపారు. యల్లపువానిపాలెం జగనన్న ఆరోగ్య శిబిరంలో ఆయన 'సాక్షి'కి ఆ వివరాలు వెల్లడించారు. ఈ వైద్య శిబిరాల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అందు కోసం ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వైద్య శిబిరాల వివరాలు ఇలా ఉన్నాయి.12న ముత్యాలమ్మ కాలనీ యూపీహెచ్‌సీ, 16, 17 వేపగుంట తేదీల్లో కమ్యూనిటీ హాలు, 18, 19 పురుషోత్తపురం యూపీహెచ్‌సీ, 20, 21, 24 బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ, 25, 26, 27 పెందుర్తి యూపీహెచ్‌సీ, 28, 30, 31 లక్ష్మీనగర్ యూపీహెచ్‌సీ, నవంబర్ 1,2 తేదీల్లో చంద్రనగర్ జెడ్పీ హైస్కూల్, 3న ముత్యాలమ్మ కాలనీ యూపీహెచ్‌సీలో శిబిరాలు జరుగుతాయని తెలిపారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా ప్రాంతాల స్థానికులకు వలంటీర్లు సమాచారం అందిస్తారన్నారు. ఏ సచివాలయం పరిధి వారు రావాలో సూచిస్తారని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం : ఆర్ఆర్‌వీపురం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ నరసింహనగర్, ఇందిరానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహణ పనుల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రాంతంలో బాపూజీనగర్, టైలర్స్ కాలనీ, శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్, గోపాలపట్నం బంక్ ఏరియా, ఇందిరానగర్, నరసింహనగర్, గణేష్‌నగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించాలని పేర్కొన్నారు.

ఎంఐజీ కాలనీలో ఆరోగ్య సురక్ష సర్వే

మల్కాపురం : జీవీఎంసీ 60వ వార్డు ఎంఐజీ కాలనీ పరిధిలో మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జరిగింది. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి స్థానికుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, అవసరమైన వైద్య సేవలందించారు. పలువురికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ జనరల్ సెక్రటరీ మనోహర్, శానిటరీ హెల్త్ సెక్రటరీ భీమ్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షపై విస్తృత సర్వే..

విశాఖ విద్య : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బుచ్చిరాజుపాలెం–1 సచివాలయం పరిధిలో మంగళవారం విస్తృత సర్వే నిర్వహించారు. హెల్త్ సెక్రటరీ నాగలక్ష్మి, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. ఈ నెల 20న బుచ్చిరాజుపాలెం సెంటిన్స్ పాఠశాలలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం చేశారు. ఇందుకు సంబంధించిన టోకెన్లు అందజేశారు.



ఆరోగ్య సర్వేలో పాల్గొన్న ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



వెంకటాపురంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం : జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం, గోపాలపట్నం రైతు బజారు వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆటో డ్రైవర్లు క్షీరాభిషేకం చేశారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందించిన నాయకుడు మన ముఖ్యమంత్రి జగన్ అన్నారు. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుణిశెట్టి శ్రీనివాసరావు, ఆటో డ్రైవర్లు గోపి, బాలు, వెంకటరమణ, కోటి, ఈశ్వరరావు, పి. వెంకట్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో 25 కిలోల గంజాయి పట్టివేత



టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డ విశ్వనాథ పాటిల్

గోపాలపట్నం : వేర్వేరు ప్రాంతాల్లో 23 కిలోల గంజాయిని గోపాలపట్నం, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీరు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అరకు నుంచి 3 కిలోల గంజాయి తీసుకు వచ్చి అమ్మకాలు సాగిస్తుండగా గోపాపట్నం పోలీసులు పట్టుకున్న ఘటన శ్మశాన వాటిక వద్ద మంగళవారం చోటు చేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలసకు చెందిన పి. జాని (25), పెందుర్తికి చెందిన పి. సతీష్ (20), కె. వరప్రసాద్ (20) అరకు ప్రాంతం లోతేరు నుంచి 3 కిలోల గంజాయి ఇటీవల తీసుకు వచ్చారు. జాని పెయింటర్‌గా పని చేస్తున్నాడు, సతీష్ ట్రాన్స్‌పోర్టు కంపెనీలో సూపర్‌వైజర్, వరప్రసాద్ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. వీరు గోపాలపట్నం శ్మశాన వాటిక వెనుక భాగంలో తెచ్చిన గంజాయి అమ్మేందుకు యత్నిస్తున్న సమయంలో పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 3 కిలోల గంజాయి, 2 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎయిర్‌పోర్టు స్టేషన్ పరిధిలో..

టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్రమంగా రవాణా చేస్తున్న 22 కిలోల గంజాయిని ఎన్ఏడీ జంక్షన్ సమీపంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద పట్టుకున్నట్లు నరవ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్రకు చెందిన విశ్వేశ్వర విశ్వనాథ పాటిల్ అరకులో గంజాయి కొనుగోలు చేసి బస్సులో విశాఖ రైల్వే స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో ఎన్ఏడీ వద్ద పట్టుకున్నారు. ఈ గంజాయిని మహారాష్ట్రకు తరలించేందుకు యత్నించినట్లు తెలిపారు. అతన్ని అదుపులోకి తీసుకుని 22 కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన ఎయిర్‌పోర్టు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అప్పన్నకు ఘనంగా ఏకాదశి ఆర్జిత సేవలు

సింహాచలం: ఏకాదశి సందర్భంగా శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేయింపజేశారు. ఉభయదాతలను స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు.

బాధితులకు నాయకుల పరామర్శ

పరిస్థితి విషమంగా ఉన్న నలుగురికి సొంత ఖర్చుతో వైద్యమందిస్తానని ఆడారి ఆనంద్ హామీ



సెయింట్ ఆన్స్ ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడుతున్న తహసీల్దారు వీరభద్రరావు, సీఐ జి.డి.బాబు, బద్రీనాథ్



బాధితుడి ఇంటికెళ్లి పరామర్శిస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు ములగాడ గ్రామానికి చెందిన యువకులు ఆదివారం మధ్యాహ్నం పాతగాజువాక వద్ద ఓ హోటల్లో భోజనం చేసి అస్వస్థతకు గురయ్యారు. బాధితుల్లో ఇద్దరికి మల్కాపురం సెయింట్ ఆన్స్ ఆసుపత్రిలో చికిత్స జరుగుతుండగా, కొంత మందికి నగరంలోని కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. కొందరు ఇంటి వద్దే చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో ఉన్న వారి యోగక్షేమాలను ములగాడ మండల తహసీల్దార్ డి.వీరభద్రరావు, మల్కాపురం సీఐ జి.డి.బాబు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, సోమునాయుడు తదితరులు అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా మెరుగైన వైద్యం కోసం బాధితుల కుటుంబ సభ్యులు కోరగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ స్పందించారు. బాధితులకు కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో తన సొంత నిధులతో వైద్యం అందించేందుకు ముందుకు రావటంతో బాధితుల బంధువులు ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలకే పరిమితమైన టీడీపీ, జనసేన

అస్వస్థతకు గురై మల్కాపురం సెయింట్ ఆన్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులను టీడీపీ, జనసేన నాయకులు పోటాపోటీగా పరామర్శించి, ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్లిపోయారు. బాధితుల వైద్యానికి ఎంత ఖర్చవుతుంది.. ఆ ఖర్చు ఇద్దామా అన్న ఆలోచన చేయలేదు. అయితే వారిలా కాకుండా ఆడారి ఆనంద్‌కుమార్ సెయింట్ ఆన్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమంగా ఉన్న నలుగురు యువకులకు మెరుగైన వైద్యానికి అవసరమైన ఖర్చులను తనే భరిస్తానని హామీ ఇవ్వటంతో బాధితుల బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

బాతు 'బొప్పాయి'



బాతును పోలిన బొప్పాయి పండు



మహిళా రైతు సత్యవతి

విశాఖ విద్య: ఎన్ఏడీ సమీపంలోని మర్రిపాలెం రైతు బజారులో బాతు ఆకారంలో బొప్పాయి ఆకట్టుకుంది. సబ్బవరం మండలం వంగలి గ్రామంలోని తమ పొలంలో వేసిన బొప్పాయి చెట్టుకు కాసిన పండ్లను కోయగా, ఇది కనిపించిందని మహిళా రైతు వి.సత్యవతి తెలిపారు. బాతు ఆకారంలో ఉన్న బొప్పాయి పండును రైతు బజారుకు వచ్చిన వారంతా ఆసక్తిగా తిలకించారు.

వ్యర్థాలు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..



సర్వీస్ రోడ్డులో వ్యర్థాలను తొలగించిన అనంతరం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు కోరమాండల్ గేటు ఎదురుగా ఉన్న మల్కాపురం వాటర్ సప్లై కార్యాలయం వద్ద గల సర్వీస్ రోడ్డులో పలువురు నిర్లక్ష్యంగా వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. పశువులు, పందులు, వీధి కుక్కలు ఆ చెత్తను చెల్లాచెదురు చేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'డంపింగ్ యార్డులుగా మారిన సేవా మార్గాలు' శీర్షికన సాక్షిలో మంగళవారం వార్త ప్రచురితమైంది. దీనిపై శానిటరీ అధికారులు స్పందించి సిబ్బందితో వ్యర్థాలను తీయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యసనాలకు దూరంగా ఉంటే సంపూర్ణ ఆరోగ్యం



ఎయిడ్స్ సింబల్ మాదిరిగా విద్యార్థుల ప్రదర్శన

గోపాలపట్నం : నరవలోని బెహరా నర్సింగ్ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి మాట్లాడుతూ సానుకూల దృక్పథంతో వ్యవసనాలకు అలవాటు పడకుండా ఉంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. అక్టోబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీ అన్నారు. మానసిక ఆరోగ్యం సార్వత్రిక మానవ హక్కు అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ మేరకు నరవ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సెల్‌ఫోన్లు, ఆన్‌లైన్ గేములకు అలవాటు కాకూడదన్నారు. టెక్నాలజీని అవసరం మేరకే వాడుకోవాలని సూచించారు. యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనూష ప్రియ, దివ్యశ్రీ, అధ్యాపకులు నీరజ, దీపక్, షర్మిళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సెమినార్లతో నూతన పోకడలపై అవగాహన



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం : ఎన్ఎస్‌టీఎల్‌లో 5 రోజుల ఎడ్యుకేషన్ సెమినార్ నిర్వహించారు. అందులో భాగంగా డీఆర్‌డీవో ఉద్యోగులతో అప్లికేషన్ ఆఫ్ ఇండస్ట్రీ 4.0 కాన్సెప్ట్ కార్యక్రమం జరిగింది. అత్యాధునిక అంశాలైన స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, 3డీ ప్రింటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్, వర్చువల్ రియాలిటీ వంటి పలు అంశాలపై రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఐఐటీ, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొని చర్చించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్. మధుకిరణ్, విశ్రాంత శాస్త్రవేత్త పీవీఎస్ గణేష్‌కుమార్, ఐఐటీ తిరుపతి ఆచార్యులు డాక్టర్ ఎం. రవిశంకర్, టెక్నికల్ అధికారులు సీహెచ్‌కేవీ సీతారాం, ఎం. మహేష్ తదితరులు పాల్గొన్నారు.